సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం, 16, ఏప్రిల్, 2024



పర్ణశాల దర్శనం పరమపావనం..
వనవాస కాలంలో సీతారామ లక్ష్మణులు కుటీరంలో నివసించిన పర్ణశాల దర్శనం పరమ పావనమని భక్తుల విశ్వాసం. 8లో



తాగునీటికి ఢోకా లేనట్టే
కుమ్మరిగూడెంలో దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి నీటిమట్టం పెరగడంతో తాగు నీటికి ఢోకా లేనట్టేనని భావిస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
40° / 25°
వాతావరణం
జిల్లాలో మంగళవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ ప్రభావం పెరగడంతో పాటు, వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి రుద్రాభిషేకం



అమ్మవారికి లక్ష కుసుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : శ్రీ దేవీ వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు రుద్రాభిషేకం, లక్ష మల్లె పూలతో కుసుమార్చనను వైభవంగా నిర్వహించారు. అనంతరం నాద నీరాజనం, శ్రీచక్రార్చన, సూర్యనమస్కారాలు, సూక్త పారాయణం, చండీసప్తసతీ పారాయణం, హోమాలతో పాటు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వేడుకలను జరిపించారు. ఆ తర్వాత అమ్మవారికి మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో ఈఓ సుదర్శన్, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

నేడు ఆయిల్‌ఫెడ్ ఎండీ పర్యటన

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో మంగళవారం ఆయిల్‌ఫెడ్ ఎండీ అశోక్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ విషయాన్ని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ అధికారి ఆకుల బాలకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ, నారంవారిగూడెం వద్ద ఉన్న ఆయిల్‌ఫెడ్ నర్సరీలను సందర్శించడమే కాక దమ్మపేట మండలం అప్పారావుపేటలోని ఫ్యాక్టరీని ఎండీ పరిశీలిస్తారని చెప్పారు. ఆయిల్‌ఫెడ్ ఎండీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆయన వస్తున్న నేపథ్యాన అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, ఆయిల్‌ఫెడ్ ఎండీతో పాటు జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ప్లాంట్స్ అండ్ ప్లాంట్స్ మేనేజర్ కల్యాణ్‌గౌడ్, నాగబాబు పాల్గొంటారు.

సింగరేణిలో మళ్లీ బయోమెట్రిక్ హాజరు

సింగరేణి(కొత్తగూడెం): కరోనా సమయాన నిలిపేసిన బయోమెట్రిక్ విధానాన్ని తిరిగి మొదలుపెట్టేందుకు సింగరేణి యాజమాన్యం కసరత్తు చేపట్టింది. ఇందుకు సంబంధించి సోమవారం సర్క్యులర్ విడుదలైంది. సంస్థ పరిధిలోని 18 ఓపెన్‌కాస్టులు, 22 భూగర్భ గనుల పరిధిలోని అన్ని విభాగాలు, ఏరియా వర్క్ షాప్‌లు, సర్వేస్ డిపార్ట్‌మెంట్లు, జీఎం కార్యాలయాలే కాక కార్పొరేట్ కార్యాలయంలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు, కార్మికులు ఇక నుంచి బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలోనే ఈ విధానం ఉన్నా కరోనా సమయాన నిలిపేశారు. ఆతర్వాత కొన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో అమలవుతుండగా.. ఇంకొన్ని చోట్ల మొదలుకాకపోవడంతో కొందరు ఉద్యోగులు, కార్మికులు, యూనియన్ల నాయకులు హాజరు నమోదు చేసుకుని బయటకు వెళ్లిపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీంతో సింగరేణి విజిలెన్స్ విభాగానికి అందిన ఫిర్యాదులతో పూర్తిస్థాయిలో బయోమెట్రిక్ విధానం అమలుకు నిర్ణయించారు. ఈమేరకు ఐరిస్, ఫింగర్ ప్రింట్, బయోమెట్రిక్ తదితర పరికరాలు సమకూర్చడంతో పాటు ఇతర ఏర్పాట్లు చేసేందుకు ఐటీ సంస్థల నుంచి సింగరేణి సంస్థ త్వరలోనే టెండర్లు ఆహ్వానించనున్నట్లు తెలిసింది.

నర్సరీల నిర్వహణ పటిష్టంగా ఉండాలి

ఇల్లెందురూరల్: నర్సరీల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని అటవీ శాఖ సీసీఎఫ్ భీమా నాయక్ అన్నారు. మండలంలోని రేపల్లెవాడలోని జోడుబౌళి నర్సరీని సోమవారం ఆయన తనిఖీ చేశారు. మొక్కలు ఎదిగేందుకు తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. కంపోస్టు ఎరువు తయారీ యూనిట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సహజంగా అడవుల్లో పెంచే మొక్కలతో పాటు కోతులు వనంలోకి తిరిగి వచ్చేలా ఫలాలనిచ్చే మొక్కలను కూడా నర్సరీలలో పెంచేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ కృష్ణగౌడ్, ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్న, ఎఫ్ఆర్ఓ ప్రసాద్ పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



కామేశ్వరరావు

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ వేముల కామేశ్వరరావుకు డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ కె.అర్జున్‌రావు పర్యవేక్షణలో ఆయన 'వడ్డెర్ల సాంఘిక, ఆర్థిక పరివర్తనం' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా కామేశ్వరరావును ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్, వైస్ ప్రిన్సిపాల్ భద్రయ్య తదితరులు అభినందించారు.

వైభవం.. ధ్వజారోహణం

శాస్త్రోక్తంగా పూర్తయిన వేడుక
- సంతాన ప్రాప్తి కోసం మహిళలకు గరుడ ప్రసాదం
- భేరీపూజతో ముక్కోటి దేవతలకు ఆహ్వానం
- నేడు కల్యాణంలో కీలక ఘట్టమైన ఎదుర్కోలు ఉత్సవం





బేడా మండపంలో అగ్ని ప్రతిష్ఠ పూజలు చేస్తున్న అర్చకులు (ఇన్‌సెట్) మహిళలకు గరుడ ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణ వేడుకను ఆలయ అర్చకులు సోమవారం వైభవంగా నిర్వహించారు. శ్రీ మహా విష్ణువుకు ప్రీతిపాత్రుడైన గరుత్మంతుడి చిత్ర పటాన్ని తెల్లటి వస్త్రంపై చిత్రించి ధ్వజస్తంభంపై ఎగురవేశారు. ఉదయం యాగశాలలో తిరువారాధన, సేవా కాలం, నివేదన, మంగళాశాసనం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎలాంటి విఘ్నాలు కలగకుండా ఉండేందుకు సేనాధిపతి, విఘ్ననాశకుడు అయిన విశ్వక్సేన అర్చన గావించి, పుణ్యాహవచనం, మూర్తి కుంభావాహన, భద్రక మండల ఆరాధన, ద్వార తోరణ ఆరాధన నిర్వహించి నవాహ్నిక దీక్షకు అగ్ని ప్రతిష్ఠాపన చేశారు. గరుడ పటంతో యాగశాల నుంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణగా తీసుకొచ్చి ఆరాధన చేశారు. గరుడ మహా సంకల్పం, గరుడ గద్యనం, గరుడ మంగళాష్టకాలను ప్రధానార్చకులు పఠించగా, మంగళ వాయిద్యాల నడుమ ధ్వజారోహణం గావించారు. అనంతరం బలిహరణం చేసి, సంతానం లేనివారికి గరుడముద్దలను ప్రసాదంగా అందజేశారు. ఈ గరుడ ముద్ద తీసుకున్న వారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ ప్రసాదాన్ని స్వీకరించేందుకు మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఇక సాయంత్రం యాగశాలలో భేరీ పూజ నిర్వహించి.. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ ఎల్. రమాదేవి దంపతులు, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవాని రామకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతా రామానుజాచార్యులు, విజయరాఘవన్, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

మా వంశమే గొప్పదంటూ..

'అందమైన మా రామయ్య వంశమే గొప్పది' అంటూ ఆయన తరఫు అర్చకులు ఒకవైపు.. 'కాదు..కాదు.. మా చక్కనైన సీతమ్మ తల్లి వంశమే గొప్పది' అంటూ మరోవైపున అమ్మవారి తరఫు అర్చకులు.. ఇలా లయబద్ధంగా నాట్యమాడుతూ సరదాగా సాగే ఎదుర్కోలు వేడుకలకు మంగళవారం సాయంత్రం మిథిలా స్టేడియం వేదిక కానుంది. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఘడియలు సమీపిస్తున్న తరుణంలో కీలక ఘట్టమైన ఎదుర్కోలు ఉత్సవానికి ఆలయ అర్చకులు, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. హిందూ సంప్రదాయం ప్రకారం జరిగే ప్రతీ కల్యాణంలోనూ ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. ఇక ఆదర్శ జంటకు ప్రతీకలైన శ్రీ సీతారాముల తిరు కల్యాణం సందర్భంగా స్వామి, అమ్మవార్ల వంశాల గొప్పదనాన్ని వివరించే ఈ వేడుక ఆద్యంతం భక్తులకు కనువిందు చేస్తుంది. మిథిలా స్టేడియం సీతమ్మ వారికి మిథిలా నగరం కాగా, మరో పక్కనున్న వైకుంఠ ద్వారం రామయ్యకు చెందిన అయోధ్యగా అభివర్ణిస్తూ పండితులు కనులపండువగా ఈ వేడుక జరుపుతారు. అలాగే హిందూ, ముస్లింల మధ్య సామరస్యాన్ని పెంపొందించేలా భక్తులందరికీ పన్నీరు చల్లడం ఈ ఉత్సవంలో మరో ప్రత్యేకత. గోల్కొండ నవాబైన తానీషాను స్మరింపజేస్తూ భద్రాచలం దేవస్థానంలో ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ కొనసాగించడం విశేషం. కాగా, నవాహ్నిక తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, గురువారం పట్టాభిషేకం వేడుకలు జరపనున్నారు.

పట్టు వస్త్రాలు సమర్పించేది అధికారులే !

భద్రాచలం : భద్రాచలం రామాలయంలో బుధవారం జరిగే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది ఎన్నికల కోడ్ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి పట్టువస్త్రాలు అందజేస్తారని సమాచారం. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు సైతం ఈ వేడుకల్లో పాల్గొనేందుకు సోమవారమే భద్రాచలం చేరుకున్నారు. కాగా జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, వారి అనుచరులు వీవీఐపీ, వీఐపీ హోదాలో హాజరయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

సీతారాముల కల్యాణానికి సిరిసిల్ల చీర

భద్రాచలంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణానికి 'సిరిసిల్ల' చీర చేరుకుంది. సిరిసిల్లకు చెందిన వెల్ది హరిప్రసాద్ ప్రతి ఏడాది రాముడిపై భక్తితో స్వయంగా నేసిన చీరను బహుమతిగా ఇస్తున్నారు. ఈ ఏడాది కూడా 800 గ్రాముల బరువుతో చీర తయారు చేయగా.. ఇందులో రెండు గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండి, పట్టు దారాలతో నేయటం విశేషం. చీర కొంగులో సీతారాముల కల్యాణ చిత్రాన్ని నేయడం మరింత ఆకర్షణగా నిలిచింది.

రామయ్య కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

దేవాదాయ, పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ కమిషనర్, కలెక్టర్, ఇతర అధికారులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో బుధ, గురువారాల్లో జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, కల్యాణానికి వీక్షించేందుకు వచ్చే భక్తులకు కూడా సకల సౌకర్యాలు కల్పించామని దేవాదాయ, పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. కల్యాణోత్సవం జరిగే మిథిలా స్టేడియంలో చేస్తున్న ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణానికి ప్రపంచంలోనే ఓ ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున అదే స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఎండాకాలం కావడంతో చలువ పందిళ్లు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు కల్యాణ వేడుకలను వీక్షించేందుకు మిథిలా స్టేడియాన్ని 24 సెక్టార్లుగా విభజించామని, ప్రతీ సెక్టార్‌లో ఎల్ఈడీ టీవీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కల్యాణ టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అరచేతిలో సకల సమాచారం..

శ్రీరామనవమి ఉత్సవాలకు వచ్చే భక్తులకు వసతులు, సౌకర్యాలు, తలంబ్రాలు, ప్రసాదాల కౌంటర్ల వంటి సమాచారాన్ని కరపత్రాల రూపంలో ముద్రించినట్లు కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. భద్రాచలంలోని సబ్ కలెక్టరేట్‌లో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. భక్తులు ఉత్సవాల వీక్షణం అనంతరం తిరిగి క్షేమంగా వెళ్లే వరకు అధికారులు తగు జాగ్రత్తలతో విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం మిథిలా స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలించారు. ఏర్పాట్లుపై భక్తుల స్పందనను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఆర్డీఓ దామోదర్ రావు, ఏఈఓ శ్రవణ్‌కుమార్, ఈఈ రవీందర్ పాల్గొన్నారు.

నవమి రోజు భక్తులకు ఉచిత దర్శనం

శ్రీరామ నవమి రోజైన బుధవారం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని భక్తులు ఉచితంగా దర్శించుకునే అవకాశం కల్పించినట్లు ఆలయ ఈఓ రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ఒక్కరోజు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెండో వారధి ప్రారంభం

- పూజలు చేసిన కలెక్టర్ ప్రియాంక ఆల
- కొత్త బ్రిడ్జిపై రాకపోకలు షురూ..



బ్రిడ్జిని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

బూర్గంపాడు: సారపాక - భద్రాచలం మధ్య గోదావరి నదిపై నిర్మించిన రెండో బ్రిడ్జిని కలెక్టర్ ప్రియాంక ఆల సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. బ్రిడ్జి పనులు పూర్తి కావడంతో ఆమె గుమ్మడికాయ కొట్టగా సారపాక వైపున రెండో బ్రిడ్జి ప్రవేశం వద్ద వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం కలెక్టర్ బ్రిడ్జిపై నుంచి రాకపోకలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ 98.45 కోట్ల వ్యయంతో నిర్మించిన రెండో బ్రిడ్జిని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. 2.3 కిలోమీటర్ల పొడవున చేపట్టిన ఈ బ్రిడ్జి నిర్మాణంలో 1.25 కిలోమీటర్లు వంతెన కాగా, మిగిలినది అప్రోచ్ రోడ్డు అని తెలిపారు. 7.5 మీటర్ల వెడల్పుతో ఈ బ్రిడ్జి నిర్మితమైందని, 37 శ్లాబులతో బ్రిడ్జి నిర్మాణం పూర్తయిందని చెప్పారు. శ్రీరామ నవమికి వచ్చే భక్తులకు ఈ బ్రిడ్జి అందుబాటులోకి రావటం హర్షణీయమన్నారు. 2014లో బ్రిడ్జి పనులను ప్రారంభించి నేటికి పూర్తి చేసుకున్నామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న కొద్దిపాటి పనులను కూడా త్వరగా పూర్తిచేయాలని నేషనల్ హైవే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఎన్‌హెచ్ ఈఈ యుగంధర్, డీఈ శైలజ పాల్గొన్నారు.

భద్రాద్రిలో భారీ భద్రత

- బందోబస్తుకు 2,000 మంది సిబ్బంది
- ఎస్పీ రోహిత్‌రాజ్ వెల్లడి



భద్రాచలంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న రోహిత్‌రాజ్ తదితరులు

భద్రాచలం(భద్రాచలంఅర్బన్)/కొత్తగూడెం టౌన్ : భద్రాచలంలో 17, 18 తేదీలో జరిగే శ్రీరామనవమి, పట్టాభిషేకం వేడుకలకు రెండు వేల మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. భద్రాచలంలో సోమవారం ఆయన శ్రీరామనవమి ఏర్పాట్లు పరిశీలించారు. అంతకుముందు కొత్తగూడెంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సీతారామల కల్యాణానికి వీవీఐపీ, వీఐపీలతో పాటు సామాన్య భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, మావోయిస్టు ప్రభావిత, ఏజెన్సీ ప్రాంతం కావడంతో వారందరి భద్రత దృష్ట్యా ఇప్పటి నుంచే కూంబింగ్ చేస్తున్నామని తెలిపారు. భద్రాచలంలో వాహనాల ప్రార్కింగ్ సమస్యను అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూట్, పార్కింగ్ స్థలాలు, తలంబ్రాల కౌంటర్లు, లడ్డూ ప్రసాదం స్టాళ్లు, కళ్యాణమండపంలో ఉన్న అన్ని సెక్టార్లకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశామని, ఇందుకు https//bhadrachalam.netlify.app ఆన్‌లైన్ లింక్ రూపొందించామని చెప్పారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఓఎస్డీ సాయి మనోహర్, మణుగూరు, పాల్వంచ డీఎస్పీలు వంగా రవీంద్రనాథ్ రెడ్డి, సతీష్ కుమార్, సీఐలు, ఎస్సైలు సంజీవరావు, నాగరాజు రెడ్డి, శ్రీనివాస్, పీవీఎస్ రావు, విజయలక్ష్మి, మధు ప్రసాద్ పాల్గొన్నారు.

మోసపూరిత వాగ్దానాలు నమ్మొద్దు



పాల్వంచలో మాట్లాడుతున్న ఎంపీ నామ, పక్కన వద్దిరాజు, తాతా మధు, వనమా

పాల్వంచ/చంద్రుగొండ : మోస పూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్.. ఇప్పుడు మళ్లీ అవే మోసపు మాటలతో లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించాలని చూస్తోందని, ప్రజలు వారి మాటలను నమ్మొద్దని ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర అన్నారు. చంద్రుగొండ మండలం అయన్నపాలెం, పాల్వంచల్లో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశాల్లో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ 44 పేజీల్లో 420 హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదని అన్నారు. తెలంగాణ సమస్యలపై పార్లమెంట్‌లో మాట్లాడింది బీఆర్ఎస్ ఎంపీలు మాత్రమేనని చెప్పారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యంతో పంటలు ఎండిపోయాయని, కొద్దో గొప్పో పండినా వాటిని కొనుగోలు చేసిన నాథుడే లేడని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్, సాగు, తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపిస్తే ప్రజా సమస్యలపై పోరాడుతానని నామ నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు దేశంలోనే ఎక్కడా లేవన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణను అభివృద్ధి బాటలో నడిపించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఆయా సమావేశాల్లో ఎమ్మెల్సీ తాతా మధు, కొత్తగూడెం, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, రెండు జిల్లాల ఇన్‌చార్జ్ జీవన్‌కుమార్, జెట్పీటీసీ భారత లావణ్య, నాయకులు తాళ్లూరి జీవన్, బరపాటి వాసుదేవరావు, కిలారు నాగేశ్వరరావు, మడివి సరస్వతి, గురువయ్య, ఉంద్రాతి రవి, మంజుల, శంకర్, వీరయ్య, శోభారాణి, మంతపురి రాజుగౌడ్, ఎస్‌వీఆర్‌కె.ఆచార్యులు, విశ్వనాథం, ఖమర్, సింహాద్రి, గోపి, మల్లెల శ్రీరాంమూర్తి, కనకేశ్, చందు, దారా వెంకటేశ్వరరావు, బోయినపల్లి సుధాకర్‌రావు, నల్లమోతు వెంకటనారాయణ, మెడా మోహన్‌రావు, చీదళ్ల పవన్‌బాబు, సూరా వెంకటేశ్వర్లు, భూపతి రమేష్, రామారావు పాల్గొన్నారు.

'నవమి'కి ప్రత్యేక బస్సులు

- భద్రాచలానికి 238 సర్వీసులు
- ఏపీ నుంచి సైతం 150 ప్రత్యేక బస్సులు
- భద్రాచలం నుంచి పర్ణశాలకు ఐదు నిమిషాలకో బస్సు
- 'ఆపరేషన్'పై డీఎంలతో ఖమ్మం ఆర్ఎం సమీక్ష



ఖమ్మంమయూరిసెంటర్/చుంచుపల్లి : భద్రాచలంలో అత్యంత వైభవంగా జరగనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాక పక్క రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తరలివస్తారు. ఈనెల 17న శ్రీరామనవమి రోజున భద్రాచలం మిథిలా స్టేడియంలో జరిగే స్వామివారి కల్యాణం, 18న జరగనున్న పట్టాభిషేకానికి హాజరయ్యే భక్తుల కోసం టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎలాంటి ఇబ్బంది కలగకుండా సర్వీసులు నడిపేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. మంగళవారం నుంచి 18వ తేదీ వరకు 238 ప్రత్యేక బస్సులను టీఎస్ ఆర్టీసీ నడిపించనుండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఏపీఎస్ఆర్టీసీ మరో 150 నుండి 170 బస్సుల వరకు ఆ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భద్రాచలానికి నడిపిస్తుంది.

ఏపీ నుంచి భారీగా భక్తుల రాక

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణాన్ని తిలకించేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. ఈ నేపథ్యాన ఏపీఎస్ఆర్టీసీ సైతం అక్కడి నుంచి భద్రాచలానికి ప్రత్యేక బస్సులు నడిపించనుంది. విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, అమలాపురం, ఏలూరు, గోకవరం, తిరువూరు నుంచి 150 నుంచి 170 బస్సులు నడిపించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఏపీ నుంచి వచ్చే రెగ్యులర్ బస్సులే కాక ప్రత్యేక బస్సులను నిలిపేందుకు, ప్రయాణికులను ఎక్కించుకునేందుకు భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రత్యేక పాయింట్ ఏర్పాటు చేశారు. భద్రాచలం బస్టాండ్‌లో రద్దీ కారణంగా ఇబ్బందులు ఎదురుకాకుండా కళాశాల మైదానాన్ని ఏపీఎస్ఆర్టీసీ పాయింట్‌గా ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే, కళాశాలలో దిగిన భక్తుల కోసం కరకట్ట వరకు మినీ బస్సులను నడిపిస్తారు. రూ.10 చెల్లించి ఈ బస్సుల్లో ఎక్కడైనా ఎక్కి ఎక్కడైనా దిగే వెసులుబాటు కల్పించారు.

పర్ణశాలకు బస్సులు

భద్రాచలం బస్టాండ్ నుంచి పర్ణశాల వరకు నడుపుతున్న రెగ్యులర్ సర్వీసులతో పాటు, ప్రయాణికుల రద్దీని తట్టుకోడానికి ప్రతీ ఐదు నిమిషాలకో బస్సు నడిపించాలని నిర్ణయం తీసుకున్నారు. కాగా, ఖమ్మం రీజియన్ నుంచి ఆపరేట్ చేసే రెగ్యులర్ సర్వీసులు, ప్రత్యేక సర్వీసులన్నీ భద్రాచలం బస్‌స్టేషన్ వరకు వచ్చి వెళ్తాయి. కాగా, అన్ని బస్సుల్లో మహిళా ప్రయాణికులకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారు. ఇక కొత్తగూడెం నుంచి భద్రాచలానికి ఎక్కువ బస్సులు తిప్పేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అంతేకాక హైదరాబాద్ సెక్టార్ నుంచి వచ్చి వెళ్లే ప్రయాణికుల కోసం రిజర్వేషన్ల ఆధారంగా బస్సులు సంఖ్య పెంచే అవకాశముంది.

అధికారులతో ఆర్ఎం సమీక్ష..

శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక బస్సులు నడిపించనున్న నేపథ్యాన ఖమ్మం రీజనల్ మేనేజర్ చెరుకుపల్లి వెంకన్న సోమవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో రీజనల్ పరిధిలోని డిపో మేనేజర్లతోపాటు ఏపీఎస్ఆర్టీసీ అధికారులతో సమీక్షించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చే భక్తుల్లో ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులను ఎంచుకుంటారని తెలిపారు. దీంతో భక్తులకు అసౌకర్యం కలగకుండా సమయానుకూలంగా బస్సులు నడిపించాలని, అధికారులు తమకు కేటాయించిన పాయింట్లలో ఉండి పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్యాధికారులు కూడా భక్తులకు, ఆర్టీసీ సిబ్బందికి అందుబాటులో ఉండాలని తెలిపారు. రద్దీ నేపథ్యాన ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సెక్యూరిటీ సిబ్బందిని నియమిస్తున్నామని, తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం కూడా కల్పిస్తున్నామని ఆర్ఎం వెల్లడించారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా..

శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా టీఎస్ ఆర్టీసీ సర్వీసులు నడిపించేందుకు ఏర్పాట్లు చేసింది. గత ఏడాది అనుభవాలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు మహాలక్ష్మి పథకం నేపథ్యాన మహిళా భక్తులు అధికసంఖ్యలో వస్తారన్న అంచనాలతో బస్సులు సిద్ధం చేశారు. శ్రీరామనవమి సందర్భంగా నడిపించే ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు లేకపోగా.. మహిళలకు ఉచిత ప్రయాణం వర్తించనుంది. రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేందుకు డిపో మేనేజర్లు, ఇతర అధికారులకు బాధ్యతలు అప్పగించారు. టీఎస్ ఆర్టీసీ నడిపే 238 బస్సుల్లో ఖమ్మం రీజియన్‌కు సంబంధించినవి 208 ఉండగా.. వరంగల్, నల్లగొండ, కరీంనగర్ డిపోల నుంచి పది చొప్పున 30 బస్సులను జిల్లాకు రప్పించనున్నారు.

పాయింట్ల వారీగా విధులు నిర్వర్తించనున్న అధికారులు

ప్రదేశం	అధికారి	సెల్ నంబర్
భద్రాచలం	డిపో మేనేజర్, మధిర	99592 25961
	డిపో మేనేజర్, భద్రాచలం	99592 25960
పర్ణశాల	డిపో మేనేజర్, మణుగూరు	99592 25963
ప్రభుత్వ కాలేజీ మైదానం	డిపో మేనేజర్, సత్తుపల్లి	99592 25962
కొత్తగూడెం	డిపో మేనేజర్, కొత్తగూడెం	99592 25959
ఖమ్మం	డిపో మేనేజర్, ఖమ్మం	99592 25958
మణుగూరు	ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్	73828 58121
సత్తుపల్లి	ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్	63035 61217
మధిర	ట్రాఫిక్ సూపరింటెండెంట్	87900 14668

క్లుప్తంగా

హైకోర్టు జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ కార్యవర్గం


జడ్జికి వినతిపత్రం ఇస్తున్న బార్ అసోసియేషన్ బాధ్యులు

కొత్తగూడెంటౌన్: తెలంగాణ హైకోర్టు జస్టిస్ ఎన్వీ.శ్రావణ్‌కుమార్‌ను కొత్తగూడెం బార్ అసోసియేషన్ బాధ్యులు సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈసందర్భంగా కొత్త కోర్టులోని సమస్యలను జడ్జికి వివరించి వినతిపత్రం అందజేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ తెలిపారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తోట మల్లేశ్వరావు, ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.ఆర్.రవిచంద్రతో పాటు మహ్మద్ సాదిక్‌పాషా, ఏ.కరుణాకర్, ఎస్.ప్రవీణ్, డి.రవికుమార్, మారపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం


దాతకు రశీదు ఇస్తున్న ఆలయ ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి భద్రాచలానికి చెందిన వైద్యులు సీతారామరాజు – కృష్ణవేణి దంపతులు రూ.50 వేల విరాళం అందచేశారు. ఈసందర్భంగా సోమవారం ఆలయ అధికారులకు నగదు అందజేసి స్వామిని దర్శించుకున్నారు.

నగదు స్వాధీనం

అశ్వారావుపేట(ములకలపల్లి): అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న సుమారు రూ.1.5 లక్షల నగదును పోలీస్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల బృందం (ఎఫ్ఎస్‌టీ) సోమవారం స్వాధీనం చేసుకుంది. ఎస్సై రాజమౌళి, ఎఫ్ఎస్‌టీ అధికారి మోతీలాల్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని మూకమామిడి క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తీసుకెళుతున్న వేర్వేరు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ఒకరి నుంచి రూ.97,150, మరో వ్యక్తి నుంచి రూ. 53 వేలు స్వాధీనం చేసుకున్నారు.

ఏజెన్సీలో కనిపించని మావోల బంద్ ప్రభావం

చర్ల: ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టుల బంద్ ప్రభావం కనిపించలేదు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న అణచివేత ధోరణిని నిరసిస్తూ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సోమవారం ఛత్తీస్‌గఢ్, తెలంగాణ మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల బంద్‌కు పిలుపునిచ్చింది. పలుమార్లు లేఖలు విడుదల చేసి బంద్ పాటించాలని కోరింది. అయితే బంద్ ప్రభావం ఏజెన్సీ ప్రాంతంలోని చర్ల దుమ్ముగూడెం, వెంకటాపురం, వాజేడు మండలాల్లో ఏ మాత్రం కనిపించలేదు. ఆటోలు, ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు యథావిధిగా తిరిగాయి. కిరాణా దుకాణాలు, పాన్‌షాపులు, హోటళ్లు, పెట్రోల్‌బంక్‌లు తెరిచే ఉంచారు. బంద్ సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పెద్ద ఎత్తున గస్తీ తిరిగారు. కాగా ఆర్టీసీ మాత్రం సాయంత్రం 4 గంటల నుంచి ఏజెన్సీ ప్రాంతాలకు బస్సు సర్వీసులను నిలిపివేసింది.

వరకట్న వేధింపులు

అశ్వారావుపేట (ములకలపల్లి) : అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఉదంతంపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని రామాంజనేయపురం గ్రామానికి చెందిన శిరీషకు సుమారు నాలుగేళ్ల క్రితం పాల్వంచ నవభారత్‌కు చెందిన పల్లపు వెంకటేశ్‌తో వివాహం జరిగింది. వివాహ సమయంలో లాంఛనాలు అందజేశారు. నాటి నుంచి అదనపు కట్నం తేవాలంటూ భర్త, అత్తమామలు వేధింపులకు గురిచేస్తున్నారు. రెండు నెలల క్రితం శిరీష-వెంకటేష్ దంపతులకు బాలిక జన్మించగా, వేధింపులు ఎక్కువయ్యాయి. గ్రామపెద్దలు పలుమార్లు పంచాయితీ నిర్వహించినా మార్పు రాలేదు. శిరీషను ఇంటి నుంచి గెంటివేయడంతో పుట్టింటికి వెళ్లింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ములకలపల్లి ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామ సమీపంలో ఉన్న పెదవాగు నుంచి సోమవారం ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి, ఇసుక తరలిస్తున్న వినాయకపురం గ్రామానికి చెందిన బండారు మారేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను తెలిపారు.

ఆటో బోల్తా : ఇద్దరికి గాయాలు

కరకగూడెం: ఆటో బోల్తా పడి ఇద్దరు గాయపడ్డ సంఘటన సోమవారం రాత్రి జరిగింది. మండలంలోని బంగారుగూడేనికి మడకం బన్ను తన ఆటోలో ముగ్గురు ప్రయాణికులతో కరకగూడెం నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కలవలనాగారం ప్రధాన రహదారి వద్ద.. ముందు ఆగిన బైక్‌ను తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో బన్నుతోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న మరో బాలుడు మడకం నూకకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

పర్ణశాల దర్శనం.. పరమపావనం

పవిత్ర గోదావరి తీరంలో సీతా లక్ష్మణ సమేతుడైన శ్రీ రాముడు వెలిసిన పర్ణశాల పుణ్యక్షేత్రం శ్రీరామనవమికి ముస్తాబవుతోంది. ఈ నెల 17న సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరగనుంది. భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారిని దర్శించుకున్న భక్తులందరూ ఇక్కడి రామాలయానికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో పర్ణశాల ప్రత్యేకతను తెలుసుకుందాం.

– దుమ్ముగూడెం


మారువేషంలో వచ్చిన రావణాసురుడు, సీతమ్మ విగ్రహాలు

- వనవాసంలో రాముడు నడయాడిన పుణ్యభూమి
- ఇప్పటికీ నారచీరలు, మాయలేడి అడుగుల ఆనవాళ్లు

పంచవటీ కుటీరం

వనవాస కాలంలో సీతారామలక్ష్మణులు గోదావరి తీరంలోని ఐదు మర్రి చెట్లు కలిసి ఉన్న చోట పంచవటీ కుటీరం నిర్మించుకున్నారు. శ్రీరాముడు 14 ఏళ్ల పాటు సీతమ్మతో కలిసి వనవాసం చేయగా, పర్ణశాల ప్రాంతంలోనే రెండున్నర సంవత్సరాలు నివసించినట్లు ప్రతీతి. అక్కడ నిత్యం ప్రవహించే వాగు వద్ద సీతమ్మ స్నానం చేసినట్లు చెబుతారు. ఆ తర్వాత ఇక్కడి రథంగుట్టపై ఆమె ధరించే చీరలు ఆరవేయగా, దానిపై ఆ చీరల ఆనవాళ్లు ఏర్పడినట్లు ఒక కథనం. ఇక్కడ ప్రవహించే గోదావరి నది అత్యంత పావనమైనదని కొన్ని ప్రత్యేక సందర్భాల్లో సీతమ్మవారు స్నానమాడిన సీతవాగు లక్ష్మణ స్వామి బాణాహతికి ఏర్పడిన పుణ్యతీర్థమని చెబుతారు. శ్రీరాముడు కూర్చున్న రాతి సింహాసనం, నార చీరలు, సీతమ్మ ఉపయోగించిన పసుపు, కుంకుమ రాళ్లు మాయలేడి అడుగుల గుర్తులు, శ్రీరామ పాద చిహ్నములు, సీతారాములు ఆడుకున్న వామన గుంటలు, కందమూలాలను ఆరగించిన రాతి కంచాలను ఇప్పటికీ పర్ణశాలలో దర్శించుకోవచ్చు.


పంచవటీ కుటీరం, సీతారాముల విగ్రహాలు

శ్రీరామ దర్శనం పరవపావనం

శ్రీసీతారామ లక్ష్మణుల పవిత్ర పాదస్పర్శతో పులకరించిన ఈ పుణ్యభూమి సందర్శనం సకలభీష్ట పదం. శ్రీరామునికి ఆదివారం ప్రీతికరమైంది. ఏకాదశి పూర్ణిమ, అమావాస్య శుక్రవారం సంకరణం, పునర్వసు వంటి పవిత్ర రోజుల్లో పర్ణశాల విశ్వక రాముని దర్శనం పరమపావనమని భక్తులు విశ్వసిస్తారు.

పర్ణశాల పేరెలా వచ్చిందంటే..

శ్రీరాముడు వనవాస సమయంలో ఆశ్రమాన్ని నిర్మించుకుని కొంతకాలం నివసించాడు. ఆశ్రమం చుట్టూ భారీగా చెట్లు కనిపిస్తాయి. 'పర్ణ' అంటే ఆకులు అని అర్థం. శాల అంటే ఇల్లు అని అర్థం. ఈ క్రమంలోనే పర్ణశాల అనే పేరు వచ్చిందని చెబుతారు. రాముడు ఇక్కడికి సమీపంలోని శివకేవ్ అనే గుహలో శివునికి ప్రార్థనలు చేసేవాడని చెబుతారు. పర్ణశాల చరిత్ర వేదకాలం నాటిది. వేదాలు అడవుల ప్రాముఖ్యత, వాటి పరిరక్షణ గురించి ప్రస్తావించాయి. పర్ణశాల చుట్టూ ఉన్న అడవులు పవిత్రమైనవిగా పరిగణిస్తారు.

భద్రాచలానికి 35 కిలోమీటర్ల దూరంలో..

భద్రాచలానికి 35 కిలోమీటర్ల దూరంలోని పర్ణశాలకు అరగంటకో బస్సు ఉంటుంది. శ్రీరామనవమి రోజు ఐదు నిమిషాలకో బస్సు తిప్పుతామని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. ప్రైవేటు వాహనాలు కూడా అందుబాటులో ఉంటాయి.


పర్ణశాల దేవాలయం




శ్రీరాముడు కూర్చున్న రాతి సింహాసనం, ఎదురుగా సీతమ్మవారి నారచీరల ఆనవాళ్లు

తాగునీటికి ఢోకా లేనట్టే...

దుమ్ముగూడెం వద్ద 49 మీటర్లకు చేరిన గోదావరి

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలోని దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి నీటి మట్టం సోమవారం 49 మీటర్లకు చేరింది. మిషన్ భగీరథ ఇన్ టేక్‌వెల్ వద్ద 48.6 మీటర్ల నీటిమట్టం ఉండడంతో జిల్లాలో జూన్ వరకు తాగునీటి సరఫరాకు ఢోకా లేనట్టేనని అధికారులు భావిస్తున్నారు. గత నెలలో ఆనకట్ట వద్ద నీటి మట్టం భారీగా తగ్గడంతో నీటి సరఫరాకు ఆటంకం కలుగుతుందని భావించిన అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఈనెల 8న ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ఇన్ టేక్‌వెల్‌ను సందర్శించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆతర్వాత నీటి ఎద్దడి రాకుండా ఎగువన ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ నుండి నీటిని విడుదల చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను కోరడంతో గత మూడు రోజులుగా ఒక గేట్ ద్వారా రోజుకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సోమవారం కూడా 200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఎగువ నుంచి వదిలిన నీరు దుమ్ముగూడెం ఆనకట్టకు చేరడంతో నిండు కుండను తలపిస్తోంది. ఫలితంగా మిషన్ భగీరథ, భారజల కర్మాగారం ఇన్ టేక్‌వెల్‌లకు నీటి సరఫరా సాఫీగా సాగుతుందని అధికారులు చెబుతున్నారు.


కుమ్మరిగూడెంలోని మిషన్ భగీరథ ఇన్ టేక్‌వెల్ వద్ద పెరిగిన గోదావరి నీటిమట్టం

నీరు, నీడ సౌకర్యం కల్పించాలి

ఇల్లెందురూరల్: ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో నీరు, నీడ, ప్రథమ చికిత్స సౌకర్యాలను విధిగా కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ పీడీ విద్యాచందన ఆదేశించారు. మండంలోని సుదిమళ్ల గ్రామపంచాయతీలో సోమవారం ఆమె ఉపాధి పనులను పరిశీలించి మాట్లాడారు. కూలీలు వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సుదిమళ్ళ, సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలలో నర్సరీలను పరిశీలించి, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ శంకర్, పంచాయతీ కార్యదర్శులు అజహర్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

అగ్ని ప్రమాదం జరిగితే డయల్ 101..

కొత్తగూడెం ఫైర్ స్టేషన్ ఆఫీసర్ గుండా పుల్లయ్య

కొత్తగూడెంటౌన్: అగ్ని ప్రమాదం జరిగితే తక్షణమే 101 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కొత్తగూడెం ఫైర్ స్టేషన్ ఆఫీసర్ గుండా పుల్లయ్య సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం బస్టాండ్, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అగ్ని ప్రమాదాల నివారణ, రక్షణ చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో స్పందించకుంటే ఆస్తి నష్టం, ప్రాణనష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. వేసవి కాలంలో ప్రజలు అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అగ్నిప్రమాదాల నుంచి ప్రజలను, ఆస్తులను రక్షిస్తూ అగ్నిమాపక శాఖ సేవలందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ ఉద్యోగులు, సిబ్బంది, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో స్కూల్ బస్సు డ్రైవింగ్

డ్రైవర్, క్లీనర్‌లపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం

బూర్గంపాడు: పూటుగా తాగి స్కూలు బస్సు నడుపుతున్న డ్రైవర్, క్లీనర్‌లపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో సోమవారం జరిగింది. తల్లిదండ్రుల కథనం ప్రకారం.. పాల్వంచలోని నారాయణ టెక్నో స్కూల్‌లో చదువుతున్న లక్ష్మీపురం గ్రామానికి చెందిన విద్యార్థులు అదే పాఠశాలకు చెందిన బస్సులో రోజు వెళ్లి వస్తారు. అయితే ఇటీవల డ్రైవర్, క్లీనర్ తాగి బస్సు నడుపుతున్నట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు. సోమవారం ఉదయం కూడా డ్రైవర్, క్లీనర్ ఇద్దరు తాగి ఉండటంతో విద్యార్థులు గమనించి తల్లిదండ్రులకు తెలిపారు. వారు వచ్చి బస్సును ఆపి, స్కూల్ యాజమాన్యానికి, పోలీసులకు, మండల విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ అక్కడికి చేరుకుని మరో డ్రైవర్‌తో విద్యార్థులను స్కూల్‌కు తీసుకెళ్లారు. మద్యం తాగిన డ్రైవర్, క్లీనర్‌పై స్కూల్ యాజమాన్యం, పోలీసులు, విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.


తల్లిదండ్రులు నిలిపివేసిన నారాయణ స్కూల్ బస్సు

నాగారం ఉపాధ్యాయుడి సస్పెన్షన్

మధ్యాహ్న భోజన బిల్లుల స్వాహాపై విచారణ

గుండాల: నిత్యం బడికి డుమ్మాకొడుతూ, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మధ్యాహ్న భోజన బిల్లులు స్వాహా చేసిన ఓ ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు పడింది. మండలంలోని నాగారం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు శంకర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టకుండానే ఏడాది కాలంగా బిల్లులు స్వాహా చేస్తున్నాడు. గత శనివారం ఎంఈఓ కృష్ణయ్య పాఠశాలను సందర్శించగా, ఉపాధ్యాయుడు పాఠశాలకు రావడం లేదని, విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టడం లేదని గ్రామస్తులు వివరించారు. దీంతో ఎంఈఓ జిల్లా అధికారులు సమాచారం అందించగా, వారు విచారణకు ఆదేశించారు. దీంతో సోమవారం కాంప్లెక్స్ హెచ్ఎం రాములుతో కలిసి ఎంఈఓ పాఠశాల రికార్డులను పరిశీలించారు. యూనిఫాం నిధులతో పాటు, పాఠశాల నిధులను కూడా స్వాహా చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి వెంకటేశ్వరాచారి ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈఓ తెలిపారు.


పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ

సరిహద్దుల్లో ఎక్సైజ్ దాడులు

- తెలంగాణ, ఏపీ అధికారుల తనిఖీలు

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఎక్సైజ్‌శాఖ అధికారులు కలిసి సోమవారం సరిహద్దు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ముందుగా ఏపీలోని ఏలూరు జిల్లా కేంద్రంలో అంతరాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరంచంద్ మాట్లాడుతూ ఏపీ అధికారుల సహకారంతో తెలంగాణలోకి అక్రమ మద్యం, గంజాయి, నాటుసారా, ఇతర మత్తుపదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రత్యేక యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామని, అన్ని సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులను బలోపేతం చేశామని వివరించారు. అనంతరం ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం అంకంపాలెం గ్రామాల్లో ఉమ్మడిగా దాడులు నిర్వహించారు. నిల్వ ఉంచిన సుమారు 50 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి ధ్వంసం చేశారు. అశ్వారావుపేట ఎక్సైజ్ సీఐ, ఎస్ఐ సాంబమూర్తి, జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ సీఐ పట్టాభి పాల్గొన్నారు.


తనిఖీ చేపడుతున్న ఇరు రాష్ట్రాల అధికారులు

వినాయక విగ్రహాల దుకాణం దగ్ధం

భద్రాచలం (భద్రాచలం అర్బన్): పట్టణంలోని చర్ల రోడ్డులో వినాయకుడి విగ్రహాలు తయారు చేసే చెందిన దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. రూ.లక్షల విలు వైన విగ్రహాలకు కాలిపోయాయి. మంటలు పక్కనే ఉన్న మరో దుకాణానికి కూడా అంటుకున్నాయి. స్థానికుల సమాచారంతో రెండు ఫైరింజన్లతో వచ్చిన అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను అదుపు చేశారు. రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని అధికారులు అంచనా వేయగా, దాదాపు రూ.8 లక్షలకు మించి నష్టం జరిగిందని బాధితుడు వల్లపు రాంబాబు ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయా? మరేదైనా కారణం ఉందా అనేది తెలియాల్సి ఉంది.

జామాయిల్ ప్లాంటేషన్ దగ్ధం

చంద్రుగొండ : చంద్రుగొండ శివారు అయన్నపాలెం గ్రామంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఆర్‌సీఎం చర్చికి సంబంధించిన జామాయిల్ ప్లాంటేషన్ సోమవారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతైంది. ఒక్కసారిగా చెలరేగిన మంటలతో 1.5 ఎకరాల తోట కాలిపోయింది. రూ. లక్ష వరకు నష్టం జరిగినట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం వేళ మండుటెండలో ప్రమాదం జరగడంతో మంటల అదుపులోకి తీసుకురావడం కష్టంమైంది. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

ట్రాన్స్‌ఫార్మర్‌లో చెలరేగిన మంటలు

పాల్వంచ: కేటీపీఎస్ ఇంటర్మీ డియట్ కాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్‌లో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికుల కథనం ప్రకారం..కేటీపీఎస్ ఇంటర్మీడియట్ కాలనీలో డీఏవీ పాఠశాల సమీపంలో ఓ ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు లేచాయి. సమాచారం అందుకున్న కేటీపీఎస్ 7వ దశ ఫైర్ స్టేషన్ ఏడీఎఫ్ఓ సునీల్‌కుమార్ ఫైర్ ఇంజన్లు, సిబ్బందితో అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

చర్ల: మండలంలోని లింగాపురంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమైంది. గ్రామంలోని మేడబత్తిని చిననర్సింహారావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంటలు ఎగసిపడ్డాయి. గమనించిన స్థానికులు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేదు. ఇల్లు, ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కుటుంబానికి సుమారు రూ. 4 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం సంభవించి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు.

పాముకాటుతో మహిళ మృతి

దమ్మపేట: మొక్కజొన్న తోటలో కూలి పనికి వెళ్లిన మహిళ పాముకాటుకు గురై ఆదివారం రాత్రి మృతి చెందింది. స్థానికు ల కథనం ప్రకారం... మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన నారం జమున(50) అదే గ్రామంలోని మొక్కజొన్న తోటలో ఆదివారం కూలి పనికి వెళ్లింది. ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో పాము కరిచింది. గమనించిన తోటికూలీలు సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం సందర్శించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

దమ్మపేట : మండల పరిధిలోని నాచారం గ్రామ శివారులో పేకాట శిబిరంపై సోమవారం పోలీసులు దాడి చేసి, కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... నాచారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం అందడంతో ఎస్సై సాయికిషోర్‌రెడ్డి, సిబ్బందితో కలిసి దాడి చేశారు. రూ.10,050 నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తుల్లో నలుగురు పారిపోగా, ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ బేస్ క్యాంపుపై మావోల దాడి

రాకెట్ లాంచర్లు విసిరిన మావోలు.. తిప్పికొట్టిన పోలీసు బలగాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు సీఆర్‌పీఎఫ్ బేస్ క్యాంపుపై దాడికి దిగారు. రాకెట్ లాంచర్లతో మావోలు దాడి చేయగా.. అప్రమత్తమైన పోలీసు బలగాలు తిప్పికొట్టాయి. ఈ ఘటన బీజాపూర్ జిల్లా తెర్రెం పోలీస్ స్టేషన్ పరిధి చుట్వాహి సీఆర్‌పీఎఫ్ బేస్ క్యాంపులో సోమవారం జరిగింది. మావోయిస్టులు, ప్రజలపై కేంద్ర ప్రభుత్వంతోపాటు ఆర్ఎస్ఎస్ చేస్తున్న దాడులను నిరసిస్తూ మావోయిస్టు పార్టీ సోమవారం ఐదు రాష్ట్రాల బంద్‌కు పిలుపునిచ్చి ంది. ఈ క్రమంలో సీఆర్‌పీఎఫ్ క్యాంపునకు సమీపం నుంచి మావోయిస్టులు బీజీజీఎల్ లాంచర్లతో దాడిచేశారు. క్యాంపు వెనుక వైపు నుంచి మావోలు లాంచర్లు విసరడం ఆరంభించగానే అప్రమత్తమైన పోలీసు బలగాలు ఎదురుదాడికి దిగాయి. పోలీసు బలగాలు పెద్దఎత్తున కాల్పులు జరపడంతో మావోయిస్టులు అక్కడి నుంచి పారిపోయారు. కాగా ఈ ఘటనలోఎలాంటి నష్టం వాటిల్లలేదని బీజాపూర్ ఎస్పీ జితేంద్రకుమార్ తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.